సంపుటి :02 సంచిక :230 పేజీలు :06 వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com Voice of the people

శుక్రవారం 14, నవంబర్ 2025




## ఇది చిన్న ఎదురుదెబ్బే !

- ఉప ఎన్నిక ఓటమిపై ఆత్మపరిశీలన చేసుకుంటాం
- ఇకపై ప్రతిపక్ష పాత్ర బలంగా పోషిస్తాం
- ఏదిఏమైనా కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం గులాబీ పార్టీనే
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

06

### సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ లో

## ఏసీబీ ఆకస్మిక తనిఖీలు

అనేక అవకతవకలు జరుగుతున్నట్లు గుర్తింపు

06



# కాంగ్రెస్ జూబ్లీ హిట్!



ఉప ఎన్నికల్లో గెలుపునకు పక్కా వ్యూహం

- నవీన్‌యాదవ్‌ను అభ్యర్థిగా ప్రకటించి 'బీసీ కార్డు' ప్రయోగం
- కలిసి వచ్చిన పరోక్షంగా ఎంఐఎం మద్దతు
- అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇవ్వడం మరింత ప్లస్
- ముస్లిం ఓట్లు చీలకుండా జాగ్రత్త వహించడం పెద్ద ఎత్తుగడ
- మాస్ ఏరియాల్లో సీఎం రేవంత్ విస్తృత ప్రచారం
- బీఆర్ఎస్ ఆరోపణలు తిప్పికొట్టడంలో సక్సెస్

02

గ్రేటర్ హైదరాబాద్‌లో బీఆర్ఎస్‌కు కంచుకోటగా ఉన్న జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో.. ఈ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి వల్లాల నవీన్ యాదవ్ ఘన విజయం సాధించారు. నియోజకవర్గ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా 24 వేలకు పైచిలుకు ఓట్లతో గెలిచారు. ఈ విజయం తెలంగాణ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చివేసింది. ప్రధాన పార్టీలన్నీ ఉప ఎన్నికను రెండున్నరేళ్ల తర్వాత వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు రెఫరెండంగా భావిస్తున్న తరుణంలో కాంగ్రెస్ పార్టీ ఆ సీటును దక్కించుకోవడం ప్రాధాన్యతను సంతరించుకున్నది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అధికార పార్టీకి దక్కిన విజయం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వానికి బలాన్ని చేకూర్చింది. అలాగే పార్టీ శ్రేణుల్లో కొత్త జోష్ నింపింది. నవీన్ యాదవ్ విజయం ఒక్కరోజుతో వచ్చింది కాదు.. ఆయన 2009 నుంచి జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోనే తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. 2009 నుంచి గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ ఎన్నికల్లో అభ్యర్థిగా పోటీ చేస్తూ, వరుసగా ఓటమి పాలవుతూ వస్తున్నారు. 2018 ఎన్నికల సమయంలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. ఆ ఎన్నికలో ఓటమి చవిచూసినప్పటికీ 18 వేలకు పైగా ఓట్లు సాధించగలరు. అనంతరం 2023లో ఆయన నాటి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అజారుద్దీన్ గెలుపు కోసం కృషి చేశారు. కానీ, అజారుద్దీన్ ఓటమి పాలయ్యారు. తాజాగా జూబ్లీహిల్స్ ఎన్నికలో నవీన్ యాదవ్ ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి 24,729 ఓట్ల మెజార్టీతో గెలిచారు.


- అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి

## కర్మ ఎవరినీ వదలదు!

**వెంటాడి తీరుతుంది.. మూల్యం చెల్లించక తప్పదు**

02

- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత
- బీఆర్ ఎస్ పెద్దలను ఉద్దేశిస్తూ 'ఎక్స్'లో సంచలన పోస్ట్





### జూబ్లీహిల్స్ పోరులో

## నవీన్ యాదవ్

- గులాబీ కంచుకోటను బద్దలు కొట్టిన హస్తం
- ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి ఘన విజయం
- సమీప బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతపై 24,729 ఓట్ల మెజార్టీ
- 98,988 ఓట్లు సాధించిన కాంగ్రెస్.. 74,259 ఓట్లు సాధించి రెండో స్థానంలో కార్
- డిపాజిట్ కూడా దక్కించుకోని బీజేపీ.. కేవలం 17,061 ఓట్లకు పరిమితం

06





## గెలుపు బాధ్యత పెంచింది !

- ప్రజలు మావైపు ఉన్నారనడానికి ఉప పోరు నిదర్శనం
- ఎంఐఎంకు మా ధన్యవాదాలు
- బీఆర్ఎస్ ఓడిపోతుందని ముందే చెప్పాను
- బీజేపీకి డిపాజిట్ కూడా రాదన్నాను.. అదే జరిగింది..
- మీడియా సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి

05

# కర్మ ఎవరినీ వదలదు !

- వెంటాడి తీరుతుంది.. మూల్యం చెల్లించక తప్పదు
- జాగృతి చీఫ్ కల్వకుంట్ల కవిత ట్వీట్



అక్షరదర్బార్, హైదరాబాద్: జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత శుక్రవారం ఒక ఆసక్తికరమైన ట్వీట్ చేశారు. "కర్మ హిట్స్ బ్యాక్స్ (కర్మ వెంటాడి తీరుతుంది) అంటూ ఆమె 'ఎక్స్' వేదికగా చేసిన ఈ ట్వీట్ ప్రస్తుతం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఎవరి పేరును గానీ, ఏ పార్టీ పేరును గానీ, ఏ అంశాన్ని గానీ ప్రస్తావించకుండా కవిత కేవలం మూడు పదాల్లో ట్వీట్ చేశారు. ఆలస్యమైనా.. ఎవరు చేసిన తప్పుకు వారు శిక్ష అనుభవించాల్సిందే అంటూ అర్థం వచ్చేలా రాసుకొచ్చారు. ఈ ట్వీట్ పరోక్షంగా బీఆర్ ఎస్ పెద్దలకు చురుకలను రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. గతంలో పార్టీ కోసం ఎంతో కష్టపడ్డానని, ఇంటి ఆడబిడ్డనైన తనను కనీసం కారణం కూడా చెప్పకుండా పార్టీ నుంచి సస్పెండ్ చేశారని కల్వకుంట్ల కవత పలు సందర్భాల్లో ఆవేదన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఆమె తన తండ్రి, పార్టీ అధినేత కేసీఆర్ మినహా.. కేటీఆర్, హరీశ్‌రావు సహా ఇతర నేతల్ని టార్గెట్ చేసి అనేక ఆరోపణలు చేశారు. తాజాగా చేసిన ట్వీట్ మరో సారి గులాబీ శ్రేణుల్లో కలకలం రేపింది.

# మొగుళ్ళపల్లిలో కాంగ్రెస్ సంబరాలు



అక్షర దర్బార్,మొగుళ్ళపల్లి; జూబ్లీహిల్స్ ఉపఎన్నిక కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం సాధించటంతో మొగుళ్ళపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి ఆధ్వర్యంలో బాణాసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు తక్కల్లపల్లి రాజు ఏఎంసి వైస్ చైర్మన్ మహమ్మద్ రఫీ మొగుళ్లపల్లి టౌన్ అధ్యక్షుడు కేతరాజు రమేష్ మంగళపల్లి శ్రీనివాస్ నడిగోటి రాము గజ్జి రాజకుమార్ పాల్గొన్నారు.





## అన్నీ తానై నడిపించిన సీఎం

**జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ఉప ఎన్నికల ప్రచారం, అభ్యర్థి ప్రకటనల విషయంలో బీఆర్ ఎస్ ముందు వరుసలో ఉన్నప్పటికీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎంపిక విషయంలో సీఎం జాగ్రత్త వహించారు. క్షేత్రస్థాయిలో మాస్ ప్రజల మద్దతు ఉన్న చిన్న శ్రీశైలం యాదవ్ కుమారుడు నవీన్ యాదవ్ ను అభ్యర్థిగా ఎంపిక చేశారు. తర్వాత పలువురు మంత్రులు, ఎ మ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి ప్రజలను ఓట్లు అభ్యర్థించా రు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రెండో శ్రేణి నేతలందిరినీ హైదరాబాద్ రప్పించారు. డివిజన్ల వారీగా వారికి మంత్రుల ఆధ్వర్యంలో బాధ్యతలు అప్పగించారు.**

# కాంగ్రెస్ జూబ్లీ హిట్!

- ఉప ఎన్నికలో గెలుపునకు పక్కా వ్యూహం
- నవీన్ యాదవ్ ను అభ్యర్థిగా ప్రకటించి 'బీసీ కార్డు' ప్రయోగం
- కలిసి వచ్చిన ఎంఐఎం పరోక్ష మద్దతు
- అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇవ్వడం మరింత ప్లస్
- ముస్లిం ఓట్లు చీలకుండా జాగ్రత్త వహించడం పెద్ద ఎత్తుగడ
- మాస్ ఏరియాల్లో సీఎం రేవంత్ విస్తృత ప్రచారం
- బీఆర్ ఎస్ ఆరోపణలు తిప్పికొట్టడంలో సక్సెస్

అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి : గ్రేటర్ హైదరాబాద్‌లో బీఆర్‌ఎస్‌కు కంచుకోటగా ఉన్న జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో.. ఈ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి వల్లాల నవీన్ యాదవ్ ఘన విజయం సాధించారు. నియోజకవర్గ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా 24 వేలకు పైచిలుకు ఓట్లతో గెలిచారు. ఈ విజయం తెలంగాణ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చివేసింది. ప్రధాన పార్టీలన్నీ ఉప ఎన్నికను రెండున్నరేళ్ల తర్వాత వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు రెఫరెండంగా భావిస్తున్న తరుణంలో కాంగ్రెస్ పార్టీ ఆ సీటును దక్కించుకోవడం ప్రాధాన్యతను సంతరించుకున్నది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అధికార పార్టీకి దక్కిన విజయం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వానికి బలాన్ని చేకూర్చింది. అలాగే పార్టీ శ్రేణుల్లో కొత్త జోష్ నింపింది. నవీన్ యాదవ్ విజయం ఒక్కరోజుతో వచ్చింది కాదు.. ఆయన 2009 నుంచి జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోనే తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. 2009 నుంచి గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ ఎన్నికల్లో అభ్యర్థిగా పోటీ చేస్తూ, వరుసగా ఓటమి పాలవుతూ వస్తున్నారు. 2018 ఎన్నికల సమయంలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. ఆ ఎన్నికలో ఓటమి చవిచూసినప్పటికీ 18 వేలకు పైగా ఓట్లు సాధించగలరు. అనంతరం 2023లో ఆయన నాటి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అజారుద్దీన్ గెలుపు కోసం కృషి చేశారు. కానీ, అజారుద్దీన్ ఓటమి పాలయ్యారు. తాజాగా జూబ్లీహిల్స్ ఎన్నికలో నవీన్ యాదవ్ ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి 24,729 ఓట్ల మెజార్టీతో గెలిచారు.

### - ప్రజల మధ్యకు వెళ్లి..

కాంగ్రెస్ పార్టీ తన అభ్యర్థి నవీన్ యాదవ్‌ను వెనుకబడిన తరగతి (బీసీ) నాయకుడిగా ప్రచారం చేయడం ఆ వర్గాల ఓటర్లను ఆకర్షించింది. నియోజకవర్గంలోని బస్తీ ప్రాంతాలైన రెహ్మత్‌నగర్, వెంకట్రావునగర్, ఎర్రగడ్డ, యూసుఫ్‌గూడ ప్రాంతాల్లో నివసించే బీసీ వర్గాల ఓటర్లు ఆయనకు ఉప ఎన్నికలో మద్దతు పలికారు. నియోజకవర్గంలో యాదవ సామాజికవర్గ ఓటర్లు ఎక్కువగా ఉంటారు. వీరంతా నవీన్ యాదవ్‌కే ఓట్లు వేసి గెలిపించారు. అలాగే ముస్లిం మైనారిటీ మద్దతు కూడా కాంగ్రెస్ గెలుపునకు బాటలు వేసింది. అందుకు ఏఐఎంఐఎం మద్దతు సైతం కలసి వచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా రంగంలోకి దిగి విస్తృతంగా ప్రచారం నిర్వహించడం కూడా నవీన్ యాదవ్ గెలుపునకు దోహదపడింది. నవీన్ యాదవ్ ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయడం కూడా విజయానికి మార్గం సుగమం చేసింది.

### - కాంగ్రెస్ పార్టీ వ్యూహాలు

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో గెలుపు కోసం పక్కా వ్యూహాన్ని అవలంబించింది. రాష్ట్రంలో 42శాతం బీసీ కోటా ఉద్యమాలు జరుగుతున్న సమయంలో నవీన్‌యాదవ్‌ను బీసీ నేతగా ప్రకటించి ప్రచారం ప్రారంభించింది. తద్వారా బీసీ ఓటు బ్యాంకును పదిలం చేసుకుంది. ముస్లిం మైనార్టీలను ఆకర్షించేందుకు ఎన్నికకు ముందు అజారుద్దీన్‌కు మంత్రి పదవి కట్టబెట్టింది. అలాగే ఎంఐఎంను ఎన్నికల్లో పోటీకి రాకుండా పరోక్షంగా ఆ పార్టీ మద్దతు పొందింది. ఈ నియోజకవర్గంలో ఎక్కువగా ఉండేది ధనిక ప్రాంతాలు, సంపన్నమైన అపార్ట్‌మెంట్లు, ఆయా వర్గాల నుంచి పోల్ అయ్యే ఓట్లు చాలా చాలా తక్కువ. దీంతో కాంగ్రెస్ పార్టీ మెజార్టీ ఓటు బ్యాంకు ఉండే రహ్మత్‌నగర్, యూసుఫ్‌గూడ, బోరబండ వంటి బస్తీ ప్రాంతాలకు ఓటర్లను టార్గెట్ చేసింది. వాస్తవానికి ఆ ప్రాంతాలన్నీ గతంలో బీఆర్‌ఎస్‌కు బలంగా మద్దతునిచ్చాయి. అలాంటి చోట కాంగ్రెస్ శ్రేణులు ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్లి, వారి మద్దతు కూడగట్టగలిగాయి. మాస్ లీడర్ గా పేరున్న దివంగత మాజీ మంత్రి పీ జనార్దన్‌రెడ్డి (పీజేఆర్)ని ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి స్మరించడం, అలాగే ఈ నియోజకవర్గంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని ప్రకటించడం.. కాంగ్రెస్ పార్టీకి కలిసి వచ్చింది. అంతేకాదు బీఆర్‌ఎస్, బీజేపీల మధ్య చీకటి ఒప్పందం ఉందని చెప్పడంపైనా ప్రజలు ఆలోచించారు.

### - బీఆర్‌ఎస్ ఓటమికి గల కారణాలు

**జూబ్లీహిల్స్ బీఆర్ ఎస్ కంచుకోట అయినప్పటికీ ఆ పార్టీకి ఓటమి తప్పలేదు. తన అభ్యర్థిగా దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సతీమణి సునీతను ప్రకటించింది. తద్వారా సానుభూతి ఓట్లు వస్తాయని బీఆర్ ఎస్ భావించింది. అయితే.. ఆ లెక్క పూర్తిగా తప్పింది. సానుభూతికి ఏమాత్రం పనిచేయలేదు. గులాబీ ఓటమికి పార్టీలోని అంతర్గత విభేదాలు కూడా ఒకకారణం. పాత, కొత్త నాయకుల మధ్య సమన్వయ లోపం ఓటర్లను గందరగోళానికి గురిచేశాయి. అలాగే రాష్ట్రంలో అధికారం కోల్పోయిన తర్వాత బీఆర్ ఎస్ అధినేత కేసీఆర్ ప్రజల మధ్యకు రాకపోవడం పెద్ద మైనస్ అయింది. ఈ ఉప ఎన్నికలో కనీసం ఆయన నియోజకవర్గంలో కాలైనా మోపలేదు. మాజీ మంత్రి హరీశ్ రావు మొదట్లో విస్తృతమైన ప్రచారం చేస్తూ వస్తున్నప్పటికీ, తర్వాత ఆయన తండ్రి కాలం చేయడంతో ప్రచారానికి ఫుల్ స్టాప్ పెట్టాల్సి వచ్చింది. పార్టీ వర్కింగ్ ప్రెసిండెంట్ కేటీఆర్ నాయకత్వంలోనే ప్రచారం సాగడం కార్యకర్తల్లో ఉత్సాహం నింపలేకపోయింది.**

# మోడీ నాయకత్వంపై ప్రజల నమ్మకమే బీహార్ విజయం

### బీజేపీ నాయకుడు ఎర్ర రామన్న



అక్షర దర్బార్, పరకాల: బీహార్ ఎన్నికల్లో ఎన్డీయే సాధించిన ఘనవిజయం ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంపై దేశ ప్రజలు ఉంచిన నమ్మకానికి నిదర్శనమని బీజేపీ జిల్లా నాయకుడు ఎర్ర రామన్న అన్నారు. గత కొన్నేళ్లుగా కేంద్రం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు మరోసారి సమర్థించారని పేర్కొన్నారు. మౌలిక వసతులు, ఉద్యోగాలు, విద్య, సంక్షేమం, శాంతి–భద్రతల పెరుగుదల వంటి అంశాల కారణంగా ప్రజలు ఎన్డీయేకు మద్దతు ఇచ్చారని తెలిపారు. ఈ ఫలితం భారత్ అభివృద్ధి దిశను మరింత బలపరుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# ధాన్యం బస్తాలు చోరీ చేసిన ఇద్దరు వ్యక్తులు అరెస్టు

అక్షర దర్బార్, కేసముద్రం : మార్గ మధ్యలో ధాన్యం బస్తాలను చోరీ చేసిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసిన సంఘటన శుక్రవారం నాడు కేసముద్రం మండలంలో చోటు చేసుకుంది. సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. యెహోవా నిస్సి రైస్ మిల్లు నిర్వాహకులు తమకు ఏఎంసి గోదాం బయ్యారం నుండి వడ్లు తీసుకురావడానికి లారీ ఓనర్ మహబూబాబాద్ మండలం ముడుపుగల్లు గ్రామానికి చెందిన అజ్మీర కృష్ణ కుమార్ ( 42) అను వ్యక్తితో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ క్రమంలో లారీ ఓనర్ అజ్మీరా కృష్ణ కుమార్ బయ్యారం నుండి కేసముద్రానికి రెండు ట్రిప్పులలో వడ్లు తరలిస్తుండగా మార్గ మధ్యలో లారీ ఓనర్,డ్రైవర్ భూక్య చక్రు కలిసి 201 వడ్ల బస్తాలను దొంగిలించారని తెలిపారు. దొంగిలించిన ధాన్యాన్ని మహబూబాబాద్ మార్కెట్ యందు వేరే రైతుల పేర్ల మీద అమ్మి వచ్చిన నగదు మొత్తాన్ని తమ అవసరాలకు వాడుకున్నారని తెలిపారు. ఈ ఘటనపై మిల్లు నిర్వాహకులు బిర్రు సందీప్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.ఈ క్రమంలో శుక్రవారం కేసముద్రం వ్యవసాయ మార్కెట్ వద్ద ఎస్సైలు క్రాంతి కిరణ్, నరేష్ లు వారి సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేస్తుండగా లారీ ఓనర్ అజ్మీరా కృష్ణ కుమార్, లారీ డ్రైవర్ భూక్య చక్రులను అదుపులోకి తీసుకుని రెండు లారీలను సీజ్ చేసి నిందుతులను రిమాండ్ కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై లు క్రాంతి, నరేష్ వారి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి

## ములుగు కలెక్టర్ దివాకర్ టి.ఎస్.

అక్షర దర్బార్, ములుగు జిల్లా ప్రతినిధి: అన్ని శాఖలు సమన్వయంతో, ప్రణాళిక బద్ధంగా పనిచేసినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్. అన్నారు. శుక్రవారం గోవిందరావుపేట మండలంలోని చల్వాయి వద్ద తెలంగాణ స్పెషల్ పోలీస్ ఐదవ బెటాలియన్‌లో నూతన జిమ్, ఓపెన్ ఏరియా జిమ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ములుగు వంటి అటవీ ప్రాంతంలో ప్రభుత్వ ఉద్యోగుల పని ధైర్యసాహసాలతో నిండినదేనని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజల మన్ననలు పొందాలంటే ప్రతి పనినీ నిబద్ధతతో



చేయాలని సూచించారు. విపత్కర పరిస్థితుల్లో ఎస్‌డీఆర్ఎఫ్ చేసిన సేవలు అత్యంత ప్రశంస నీయమని, ములుగు మాత్రమే కాక వరంగల్ జిల్లాలో కూడా వారు అందిస్తున్న సేవలు అభి నందనీయం అని ఆయన అన్నారు. అనంతరం కలెక్టర్ దివాకర్ మొక్కను నాటారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ బి. సీతారాం, అసిస్టెంట్ కమాండెంట్ అనిల్ కుమార్, వరను గోపాల్ రెడ్డి, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

# బీహార్ ప్రజలకు ధన్యవాదాలు

## బీజేపీ యువ నాయకుడు లాడే శివ



అక్షర దర్బార్, పరకాల: బీహార్ ప్రజలు ఎన్డీయేపై ఉంచిన అపార విశ్వాసానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపినట్లు శాయంపేట మండలం బిజెపి యువ నాయకుడు లాడే శివ అన్నారు. ప్రజలు అభి వృద్ధికి, శాంతి–భద్రతలకు, మంచి పాలనకు అను కూలంగా తీర్పు ఇచ్చిన తీరు దేశ ప్రజలకు స్ఫూర్తి దాయకమని ఆయన పేర్కొన్నారు. బీహార్ ఇచ్చిన ఈ తీర్పు దేశ భవిష్యత్తుకు దిశానిర్దేశం చేస్తుందని, అభివృద్ధి మార్గంలో భారత్ మరింత బలంగా ముందుకు సాగుతుందనే నమ్మకం వ్యక్తం చేశారు.








# అంగరంగ వైభవంగా మహా రుద్రయాగం

- 17నుంచి పరకాలలో ప్రారంభం
- 50 వేల మంది భక్తులు రావచ్చని అంచనా
- 21 రోజుల నమక–చమక పారాయణం
- 32 మంది రుత్వికుల సమూహ జపం
- 161 హోమకుండాలు.. 644 దంపతులు
- విశ్వశాంతి, జనసమృద్ధి కోసమే మహా రుద్ర యాగం

అక్షరదర్బార్, పరకాల: హనుమకొండ జిల్లా పరకాల పట్టణంలో సాక్షాత్ పార్వతి దేవి తపస్సు చేత ప్రతిష్ఠించ బడిన దైవిక లింగరూపమైన శ్రీ కుంకుమేశ్వర స్వామి సన్నిధిలో ఈ నెల 17న సోమవారం మహా రుద్రయాగం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉమ్మడి జిల్లాలో ఇదే మొట్టమొదటి మహా రుద్రయాగమని ఆలయ వర్గాలు పేర్కొన్నాయి. ఈ మహా యాగానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి దాదాపు 50 వేల మంది భక్తులు హాజరవుతారని అంచనా.


- **21 రోజుల వేదపారాయణం, 361 సార్లు హోమం**

మహా రుద్రునికి ప్రీతికరమైన నమక– చమకములను వేద పండితులు 21 రోజుల పాటు పారాయణం చేశారు. సోమవారం ఉదయం 31 మంది ఋత్వికులు ఏకకాలంలో జపం పూర్తి చేయగా, 51 మంది వేదపండితులు స్వాహాకారములతో 361 సార్లు హోమాన్ని నిర్వహించనున్నారు. బ్రహ్మముహూర్తంలో శ్రీ కుంకుమేశ్వరుని అనుగ్రహంతో గోపూజ, మహాగణపతి పూజ, యాగశుద్ధికోసం పుణ్యవచనం, రక్షాబంధనం, పంచావరణ దేవతా ఆవాహన, అగ్నిసంస్కారం తదితర క్రతువులు జరుగుతాయి. అనంతరం పూర్ణాహుతితో యాగం ముగించి దేవతలకు యజ్ఞభాగాలు సమర్పించనున్నారు.

**పోలీసు,రెవెన్యూ,దేవదాయ శాఖల సమన్వయం**

మహా రుద్రయాగం విజయవంతం కావడానికి పోలీసు, రెవెన్యూ, దేవదాయ శాఖ, అగ్నిమాపక, విద్యుత్, పురపాలక, వైద్య, మీడియా విభాగాలు సమన్వయం చేసుకుంటూ పనిచేస్తున్నాయని అధికారులు తెలిపారు. పరకాల పట్టణంలో పండుగ వాతావరణాన్ని అలుముకుని జరుగుతున్న ఈ మహా రుద్రయాగాన్ని భక్తులు వీక్షించి, యాగఫలితాన్ని స్వీకరించి సుఖశాంతులతో ఉండాలని కమిటీ సభ్యులు కోరుతున్నారు.

### రెండు ఎకరాల్లో యాగశాల



మహా రుద్రయాగాన్ని పరకాల ఎమ్మెల్యే ఆశీస్సులతో, సూచనలతో నిర్వహిస్తున్నామని తెలిపారు. 50 వేల మంది భక్తులు రావచ్చని అంచనా నేపథ్యంలో విస్తృత ఏర్పాట్లు చేసినట్లు ఆయన స్పష్టం చేశారు. మహా రుద్రయ్య కమిటీ అధ్యక్షుడు ఎర్ర లక్ష్మన్న మాట్లాడుతూ యాగం కోసం రెండు ఎకరాల విస్తీర్ణంలో యాగశాల, మరో రెండు ఎకరాల్లో భక్తులకు సదుపాయాలు ఏర్పాటు చేశామని తెలిపారు. గత రెండు నెలలుగా ఆలయ కమిటీ, మహా రుద్రయాగ కమిటీలు కలిసి నిర్విరామంగా కృషి చేస్తున్నాయని అన్నారు.

**కుంకుమేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ కొలుగూరి రాజేశ్వరరావు**

### 161 హోమకుండాలు, 644 దంపతుల భాగస్వామ్యం



ఈ యాగానికి 52 మంది ఋత్వికులు పాల్గొంటున్నారని, వారిలో 31 మంది ప్రధాన హోమాల్లో, మిగతా 21 మంది అంగభూత కర్మల్లో పాల్గొంటారని చెప్పారు. ఈ మహా యాగంలో 161 హోమకుండాలను ఏర్పాటు చేసి, 644 దంపతులు యజ్ఞంలో పాల్గొనేలా ఏర్పాట్లు చేశారు. యాగంలో పాల్గొనే దంపతులు తమ ఇళ్ల నుంచి పసుపు, కుంకుమ, పువ్వులు, పండ్లు, టెంకాయ, నెయ్యి తీసుకురావాలని కోరారు.

**ఆలయ అర్చకులు, కోమళ్లపల్లి సంపత్ కుమార్ శర్మ**



# కానిస్టేబుల్ మోహన్ విజిలెన్స్ కు బదిలీ

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: మొగుళ్లపల్లి పోలీస్ స్టేషన్లో గత నాలుగేళ్లుగా స్టేషన్ రైటర్ డ్యూటీ చేస్తున్న కానిస్టేబుల్ మోహన్ వరంగల్ కు బదిలీ అయ్యారు ఇదే పోలీస్ స్టేషన్లో మహిళా కానిస్టేబుల్ భవాని టేకుమల్ల పోలీస్ స్టేషన్ కి బదిలీపై పోతున్న సందర్భంగా శుక్రవారం చిట్యాల సీఐ మల్లేష్ యాదవ్, మొగుళ్లపల్లి ఎస్సై బి.అశోక్ వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ సుధాకర్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు,



# అంతరాలు లేని సమాజానికి మార్క్సిజమే మార్గం

**జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్**

అక్షరదర్బార్, గీసుగొండ: గీసుగొండ ఓంకార్ నగర్లో ఎంసిపిఐ(యు) ఆధ్వర్యంలో జరిగిన అక్టోబర్ విప్లవ వార్షికోత్సవ సదస్సులో జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ మాట్లాడుతూ పెట్టుబడిదారీ–దోపిడీ విధానాలకు మార్క్సిజమే ప్రత్యామ్నాయమని, వర్గ–సామాజిక ఉద్యమాలతో అంతరాలు లేని సమాజ నిర్మాణం సాధ్యమని తెలిపారు. మోడీ ప్రభుత్వం హామీలను విస్మరించిందని, ఓటర్ల తొలగింపుతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం వామపక్షాలు ఐక్యంగా కదలాలని పిలుపునిచ్చారు. కేంద్ర కమిటీ సభ్యుడు గోనే కుమారస్వామి ప్రజా సమస్యలు పట్టించుకోని పాలకులను తీవ్రంగా విమర్శించారు. కార్యక్రమంలో మంద రవి, కలకోట్ల యాదగిరి, గూడ సురేష్, సోమిడి రవి, బండి బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.



# పాఠకులకు అన్ని సౌకర్యాలు

అక్షర దర్బార్, ములుగు ప్రతినిధి: ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. చైర్మన్ బి. రవి చందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి అడిషనల్ కలెక్టర్ సంపత్‌రావు, డీఈవో సిద్ధార్థ రెడ్డి తదితరులు హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన కార్యక్రమంలో ప్రముఖుల చిత్రపటాలకు నివాళులర్పించారు. పాఠకుల కోసం పుస్తకాలు, ఫర్నిచర్, టాయిలెట్ బ్లాక్, కొత్త భవనం, బోరు, షెడ్ వంటి సౌకర్యాలను కల్పించినట్టు చైర్మన్ రవి చందర్ తెలిపారు. విద్యార్థులు గ్రంథాలయాన్ని వినియోగించి ప్రభుత్వం ఉద్యోగాలకు సిద్ధంకావాలని అతిథులు సూచించారు. కార్యక్రమంలో గ్రంథ పాలకులు, సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా, ప్రజా ప్రతినిధులు, గ్రంథాలయం సీనియర్ అసిస్టెంట్ ఎస్ నిఖిల్, గ్రంథ పాలకులు సమ్మక్క పాల్గొన్నారు

# 16న పద్మశాలీ కార్తీక వనభోజనాలు

**యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్ బాబు**



అక్షరదర్బార్, వరంగల్: వరంగల్ పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 16న (ఆదివారం) ఖిలావరంగల్ సమీపంలోని చింతల్ వాకింగ్ మైదానంలో నిర్వహిస్తున్న పద్మశాలీ కార్తీక మాస వనభోజన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వరంగల్ పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు బేతి అశోక్ బాబు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన అధ్యక్షతన కాశిబుగ్గలోని ప్రైవేటు పంక్షన్‌హాల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పద్మశాలి కుల బాంధవులు కుటుంబ సమేతంగా తరలి వచ్చి ఐక్యత చాటాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఆడెపు రవీందర్, కో ఆర్డినేటర్ వద్నాల నరేందర్, పద్మశాలీ సంఘాల నాయకులు కుసుమ సతీష్, డీఎస్ మూర్తి, గోరంటల రాజు, వి సూర్యనారాయణ, ఎన్ చందర్‌బాబు, బి శ్యామ్, యం యెల్లయ్య, బి శ్రీనివాస్, కె క్రాంతికుమార్, ఎ వెంకటేష్, గోరంటల మనోహర్, కె సంగీత్, జి కామేశ్వర్, బి మురళీకృష్ణ, రాజేందర్ పాల్గొన్నారు.



# వైభవంగా 25వ మండల పూజ రజతోత్సవాలు

- నర్సంపేట అయ్యప్పస్వామి ఆలయంలో ..
- వరంగల్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహా అన్నదానం





అక్షరదర్బార్, నర్సంపేట: నర్సంపేట శ్రీ ధర్మశాస్త అయ్యప్పస్వామి దేవాలయంలో 25వ మండల పూజ మహోత్సవ రజతోత్సవాలు శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీ ధర్మశాస్త అయ్యప్ప స్వామి సేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహాగణపతి హోమం, ధ్వజారోహణం, సుదర్శన హోమం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ సింగిరికొండ మాధవశంకర్ గుప్తా, అధ్యక్షుడు సైఫా సురేష్ కార్యక్రమాలను ప్రారంభించారు. నర్సంపేట అయ్యప్ప దేవాలయం తెలంగాణలో మినీ శబరిమలైగా అభివృద్ధి చెందుతుందని, దాతల సహకారంతో రూ.3 కోట్లతో దేవాలయ వికాసం జరుగుతోందని ట్రస్ట్ సభ్యులు తెలిపారు. దీక్ష సమయంలో భక్తులకు ప్రత్యేక వసతులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రజతోత్సవాల సందర్భంగా ఈ నెల 15 నుంచి డిసెంబర్ 27 వరకు పలు ప్రత్యేక పూజలు, పడిపూజలు, పుష్పాభిషేకాలు, పల్లివేట, పంబా ఆరట్టు మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. జనవరి 1న పరకాల ఎమ్మెల్యే రేవూరి సునంద ప్రకాష్ రెడ్డి చేతుల మీదుగా ప్రత్యేక పడిపూజ, మహా అన్నదానం నిర్వహించనున్నారు.

## మహా అన్నదానం

వరంగల్ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని జిల్లా అధ్యక్షుడు గోనెల రవీందర్, కార్యదర్శి బూరల సత్యనారాయణ, ఇతర సభ్యులు ప్రారంభించారు. అసోసియేషన్ తరపున 11 క్వింటాళ్ల బియ్యం అందజేస్తున్నట్లు తెలిపారు. దేవాలయ పునర్నిర్మాణ కమిటీ అధ్యక్షుడు మాదారపు చంద్రశేఖర్ గుప్తా మహా అన్నదానానికి రూ.1 లక్ష విరాళం ప్రకటించారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి చింతల కమలాకర్ రెడ్డి, కోశాధికారి దొడ్డ రవీందర్, ఇరుకు కోటేశ్వర్ రావు, పబ్బా రమేష్, మాదారపు రాంనారాయణ, చక్ర కృష్ణమూర్తి, పాలకుర్తి శ్రీనివాస్, నర్సంపేట రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల భద్రతే ప్రభుత్వ ధ్యేయం

**: ఎమ్మెల్యే జీఎస్సార్**

అక్షర దర్బార్, భూపాలపల్లి : భూపాలపల్లి ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు (జీఎస్సార్) అన్నారు. కాశీంపల్లిలో ఏర్పాటు చేసిన 16 నూతన సీసీ కెమెరాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో నేరాలు, ప్రమాదాలు, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు ఆధునిక సీసీ కెమెరా వ్యవస్థ ఎంతో దోహదం చేస్తుందని పేర్కొన్నారు. ప్రతి వీధిలో భద్రతా వలయం ఏర్పడి ప్రజలు నిశ్చింతగా జీవించే వాతావరణం ఏర్పడుతుందన్నారు. భవిష్యత్తులో భూపాలపల్లిని పూర్తిగా "స్మార్ట్ & సెక్యూర్ టౌన్"గా అభివృద్ధి చేయడం లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో సీఐ నరేష్, ఎస్సై సాంబమూర్తి పాల్గొన్నారు.

## గ్రంథాలయాలు జ్ఞానదీపాలు

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, విద్య అభివృద్ధికి అవి ఎంతో దోహదం చేస్తాయని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు (జీఎస్సార్) తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోటా రాజబాబు అధ్యక్షతన జరిగిన 58వ గ్రంథాలయాల వారోత్సవాల్లో పాల్గొన్న ఆయన, మొబైల్ వినియోగం అతిగా చేయొద్దని సూచించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కొత్త భవన నిర్మాణానికి రూ. కోటి, పుస్తకాల కొనుగోలుకు తన SDF నిధుల నుంచి రూ.10 లక్షలు మంజూరు చేస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.






# రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

**- ఎమ్మెల్యే మురళి నాయక్**

అక్షర దర్బార్, కేసముద్రం : రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మానుకోట ఎమ్మెల్యే మురళి నాయక్ అన్నారు. శుక్రవారం కేసముద్రం మండలంలోని ధన్నసరి, పెనుగొండ గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...రైతులు తేమ శాతం సరిపడా చూసుకొని మద్దతు ధర పొందాలన్నారు. ప్రభుత్వం రైతులకు వెన్ను దన్నుగా నిలుస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ సంజీవరెడ్డి, మర్రి రంగారావు, అల్లం నాగేశ్వరరావు, బండారు వెంకన్న, కొండ్రెడ్డి రవీందర్ రెడ్డి, దస్రునాయక్, సమ్మిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## భూక్యా జంపన్న నివాళి

అక్షర దర్బార్, ములుగు జిల్లా ప్రతినిధి: ములుగు జిల్లా గోవింద రావుపేట మండలం కర్లపల్లి గ్రామపంచాయతీకి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఈక హనుమంతు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఆయన మరణవార్త తెలుసుకున్న భూక్య జంపన్న గురువారం కర్లపల్లికి వెళ్లి హనుమంతు పార్థివదేహానికి పూలమాల అర్పించి నివాళులు ఘనంగా అర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ సుడి శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షుడు లకవత్ నర్సింహ, మాజీ సర్పంచ్ ఈక అంజిబాబు, సీనియర్ నాయకులు సురేష్, లక్ష్మీనారాయణ, బాధవత్ హనుము, బాధవత్ రాజ్‌కుమార్, విక్రమ్ యాదవ్, మల్లేష్ పాల్గొన్నారు.

## యాగశాలను పరిశీలించిన ఈస్ట్ జోన్ డీసీపీ



అక్షర దర్బార్, పరకాల: శ్రీ భవాని కుంకుమేశ్వర స్వామి దేవస్థానం ఆవరణంలో ఈ నెల 17న (సోమవారం) మహా రుద్ర యాగం నిర్వహించబోయే యాగశాలను వరంగల్ ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్ కుమార్ సందర్శించి మహా రుద్ర యాగం రోజు తీసుకోవలసిన జాగ్రత్తలను తెలిపినారు. వారితో పాటు పరకాల ఏసిపి సతీష్ బాబు, పరకాల సీఐ క్రాంతి కుమార్, కుంకుమేశ్వర ఆలయ చైర్మన్ కొలుగూరి రాజేశ్వరరావు, మహా రుద్ర యాగ కమిటీ చైర్మన్ ఎర్ర లక్ష్మణ్, పిట్ట వీరస్వామి, పావుశెట్టి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## గోడ పత్రిక ఆవిష్కరణ



అక్షర దర్బార్, దుగ్గొండి: తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఆవిర్భావ దినోత్సవాన్ని నవంబర్ 21న విజయవంతం చేయాలని కోరుతూ దుగ్గొండిలో గోడపత్రికను శుక్రవారం ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు పొన్నం మొగిలి ముదిరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో జిల్లా, మండల స్థాయి ముదిరాజ్ మహాసభ నాయకులు, మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.



# గెలుపు బాధ్యత పెంచింది !

- ప్రజలు మావైపు ఉన్నారనడానికి ఉప పోరు నిదర్శనం
- ఎంఐఎంకు మా ధన్యవాదాలు
- బీఆర్ఎస్ ఓడిపోతుందని ముందే చెప్పాను
- బీజేపీకి డిపాజిట్ కూడా రాదన్నాను.. అదే జరిగింది..
- మీడియా సమావేశంలో సీఎం రేవంత్



అక్షరదర్బార్, హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ విజయం తమ బాధ్యతను మరింత పెంచిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజార్టీతో విజయం సాధించిన సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నవీన్ యాదవ్ విజయం కోసం కృషి చేసిన పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్‌లో కాంగ్రెస్‌కు సరైన ఫలితాలు రాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల పాలనను ప్రజలు నిశితంగా పరిశీలించి తీర్పు ఇచ్చారని అభిప్రాయపడ్డారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 39శాతం ఓట్లు వచ్చాయని, తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఆ శాతం 42కు పెరిగిందని గుర్తుచేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓటర్లు కాంగ్రెస్‌కు 51శాతం పోల్ అయ్యాయని హర్షం వ్యక్తం చేశారు. గెలుపోటములకు కాంగ్రెస్ పొంగిపోదని, కుంగిపోదని ఉద్ఘాటించారు. ఇప్పటికైనా బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అసూయ తగ్గించుకోవాలని సూచిస్తున్నానని పేర్కొన్నారు. గులాబీ పార్టీకి అధికారం లేకపోయినా కేటీఆర్‌లో అహంకారం, అసూయ పోలేదన్నారు. తమ పార్టీపై గులాబీ నేతలు ఫేక్ న్యూస్ రాయించి.. ఫేక్ సర్వేలు చేయించుకొని భ్రమలో బతికారని ఎద్దేవా చేశారు. ఈ ఎన్నికలో బీఆర్ ఎస్ ఓడిపోతుందని ముందే చెప్పానని గుర్తుచేశారు. అలాగే బీజేపీకి డిపాజిట్ రాదని చెప్పానని, ఇప్పుడు అదే జరిగిందని పేర్కొన్నారు. తమకు ఎన్నికలో మద్దతు ఇచ్చిన ఎంఐఎంకు ధన్యవాదాలు తెలిపారు. గులాబీ అధినేత కేసీఆర్ ప్రస్తుతం క్రియాశీల రాజకీయాల్లో లేరని, ఆయన ఆరోగ్యం కూడా అంతగా సహకరించడం లేదని, ఆయన గురించి ఇప్పుడు స్పందించాల్సిన అవసరం లేదని అభిప్రాయపడ్డారు. సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లపై కంట్రోల్ రూమ్

### - జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

అక్షరదర్బార్, వరంగల్: వరి ధాన్యం కొనుగోలులో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఒక ప్రకటనలో తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యం మిల్లుకు చేరేవరకు పర్యవేక్షణపై ఫిర్యాదుల పరిష్కారానికి కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కలెక్టరేట్ లో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ ఉదయం 7 నుండి రాత్రి 8 గంటల వరకు పనిచేస్తుందని తెలిపారు. కంట్రోల్ రూమ్ లో ఫిర్యాదుల స్వీకరణకు అధికారులకు విధులు కేటాయించినట్లు చెప్పారు. ధాన్యం కొనుగోలు, లారీలు, గోనె సంచులు, కొనుగోళ్ల ప్రక్రియ మానిటరింగ్, తదితర సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబరు 1800 425 3424 ఫోన్ నంబర్ 9154252936 ను సంప్రదించవచ్చని కలెక్టర్ సూచించారు.

## మహా రుద్రయాగాన్ని విజయవంతం చేయాలి

### కో-కన్వీనర్ అశోక్ గౌడ్



అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణంలోని పురాతన శ్రీ కుంకుమేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 17న జరిగే మహా రుద్రయాగాన్ని ఘనవిజయవంతం చేయాలని మండల ప్రజలను మహా రుద్రయాగ కమిటీ కో–కన్వీనర్ ఆముదాల పెల్లి అశోక్ గౌడ్ కోరారు. అశోక్ గౌడ్ మాట్లాడుతూ, పరకాల ప్రాంతంలో ఇంత భారీ స్థాయిలో రుద్రయాగం ఇదే మొదటిసారి జరుగుతోందని తెలిపారు. ప్రత్యేక పండితబృందంతో శాస్త్రోక్తంగా అభిషేకాలు, రుద్రపారాయణం, హోమాలు, మహామంగళ హారతులు రోజంతా నిర్వహించనున్నారని పేర్కొన్నారు. భక్తుల రాక పోకలకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని కమిటీ వర్గాలు తెలియజేశాయి. ప్రతి భక్తుడు పాల్గొని మహారుద్రుని దివ్య కటాక్షం పొందాలని ఆయన ఆకాంక్షించారు.

## జూబ్లీహిల్స్ గెలుపు ప్రజా పాలనకు నిదర్శనం

### పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్

అక్షర దర్బార్, పరకాల: హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజాపాలనపై ప్రజల నమ్మకానికి నిదర్శనమని పరకాల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్ అన్నారు. పరకాల బస్టాండ్ కూడలిలో పార్టీ నాయకులతో కలిసి బాణసంచా పేల్చి, స్వీట్లు పంచుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్ రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ బుజ్జన్న, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు డా. మడికొండ శ్రీను, సమన్వయ కమిటీ సభ్యులు పసుల రమేష్, మార్క రఘుపతి గౌడ్, సదానందం గౌడ్, పోరండ్ల సంతోష్, మడికొండ సంపత్ కుమార్, మంద నాగరాజు, రఘు నారాయణ, దార్న వేణుగోపాల్, బొమ్మకంటి చంద్రమౌళి తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చదలవాడకు నివాళి

అక్షర దర్బార్, నర్సంపేట: నిస్వార్థ సేవా జీవి, శ్రామికుల ఉన్నతికై కృషి చేసిన చదలవాడ ముకుందరావు స్మారక సభ శుక్రవారం నర్సంపేటల నిర్వహించగా, పుర ప్రముఖులు, విద్యావేత్తలు పాల్గొని ఆయన సేవలను స్మరించుకున్నారు. విద్యాభివృద్ధిపట్ల మక్కువతో విద్యార్థుల కోసం పనిచేసిన వ్యక్తిని కోల్పోవడం బాధాకరమని కుటుంబ సభ్యులు తెలిపారు. గీతాంజలి విద్యా సంస్థ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న వారు రెండు నిమిషాల మౌనం పాటించి ఆయనకు నివాళులర్పించారు.

## అర్షనపల్లి–బోల్లోనిపల్లి బీఆర్ఎస్ కొత్త గ్రామ కమిటీలు ఎన్నిక

అక్షర దర్బార్, నల్లబెల్లి: నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు డా. బానోతు సారంగపాణి, పాక్స్ చైర్మన్ చెట్టుపెల్లి మురళీధర్ ఆధ్వర్యంలో అర్షనపల్లి–బోల్లోనిపల్లిలో గ్రామ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీకి డా. సారంగపాణి నియామక పత్రాలను అందజేశారు. నూతన గ్రామ కమిటీ ముఖ్య సలహాదారులుగా గాజర్ల సమ్మాలు, నూనె చిరంజీవి, అధ్యక్షుడిగా పోలు దాసరి రమేష్, ఉపాధ్యక్షులుగా పైడిమల్ల రాజు, రొట్టె రమేష్, ప్రధాన కార్యదర్శులుగా జక్కి రాములు, బోళ్ల రమేష్, కార్యదర్శులుగా బోయిని రాజు, గట్టు సమ్మాలు, కోశాధికారిగా నల్ల రమణారెడ్డి, కోఆర్డినేటర్ గా బోళ్ల పులిరాజు, ప్రచార కమిటీ అధ్యక్షుడిగా పెంబర్తి శ్రీనివాస్, కమిటీ సభ్యులుగా కోటగిరి స్వామి, మాదాస్ ఐలయ్య, బోల గోవర్ధన్, బోల సతీష్, బిక్కలూరు రవి, ములుగు చందర్ ఎన్నికయ్యారు. సమావేశంలో గాజర్ల రాజమల్లు, గట్టు మొగిలి, గట్టు సారయ్య, కోటగిరి రమేష్, పోలు దాసరి లింగయ్య, సాదా మల్లయ్య, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిపక్షాల కుట్రలు పటాపంచలు

### కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి

అక్షర దర్బార్ శాయంపేట : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎన్ని కుట్రలు చేసిన కాంగ్రెస్ ప్రజాబలం ముందు పటపంచాలయ్యాయని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజారిటీతో గెలుపొందిన నేపథ్యంలో శుక్రవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ఓటర్ లకు ధన్యవాదాలు తెలుపుతూ.. స్థానిక సంస్థ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు బూస్ట్ ని ఇచ్చారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చిందం రవి,నిమ్మల రమేష్, శానం కుమారస్వామి, వెంకట రాజిరెడ్డి, వరదరాజు, రాజేందర్, రవిపాల్, చిరంజీవి, జగన్, మార్కండేయ, బాసని రవి, విష్ణు, సుధాకర్, కుమారస్వామి పాల్గొన్నారు.

## కపాస్ కిసాన్ యాప్‌ను రద్దు చేయాలి

అక్షర దర్బార్, నల్లబెల్లి : కపాస్ కిసాన్ యాప్‌ను రద్దు చేసి ఎలాంటి షరతులు లేకుండా సీసీఐ పత్తి కొనుగోలు ప్రారంభించాలని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి డిమాండ్ చేశారు. నల్లబెల్లి గ్రామపంచాయతీ ఆవరణలో మామిళ్ల మోహన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన రైతు సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రకృతి వైపరీత్యాల వల్ల తీవ్ర నష్టం ఎదుర్కొన్న రైతులకు తేమ పేరుతో ఆంక్షలు విధించడం అన్యాయమన్నారు. మామిళ్ల మోహన్ రెడ్డి మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి కనీసం రూ.15,000 నష్టపరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేంద్రంతో చర్చించి రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జన్ను జయరాజు, సీపీఐఎం నాయకులు బొడిగె సమ్మయ్య, గోనె సంజీవయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఐటీఐ కళాశాలలో
# జాబ్ మేళా



అక్షరదర్బార్, హనుమకొండ: హన్మకొండ పైడిపెల్లి ప్రాంతంలోని విజ్ఞాన్ ప్రైవేటు ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ మేడబొయిన కొమురయ్య శుక్రవారం అధ్యక్షతన ఏర్పాటు చేసిన అప్రెంటిస్ జాబ్ మేళాను వరంగల్ ఆర్ డీడీ (ఏపీపీ) బి సీతారాములు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటిఐలో ప్రాముఖ్యత కలిగిన వేరు వేర్వేరు కంపెనీలు తుసిభా , టాటా స్రేయి, గోపి ఎలట్రికల్ ఇంజనీరింగ్ కంపెనీలు బాధ్యతతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మంచి స్పందన లభించిందని, నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఐటిఐ ప్రిన్సిపాల్ ఎం కొమురయ్య మాట్లాడుతూ ఈ కంపెనీలు కల్పిస్తున్న అవకాశాన్ని ఉపయోగించుకొని ఉద్యోగం చేసే పని మీద దృష్టి పెట్టాలని అన్నారు.

## తుడుందెబ్బ ఆదివాసి హక్కుల సమితి మండల కొత్త కమిటీ ఎన్నిక

అక్షర దర్బార్, వెంకటాపురం (నూగూరు): ఆదివాసి హక్కుల పోరాట సమితి "తుడుందెబ్బ" వెంకటాపురం మండల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. జిల్లా సహాయ కార్యదర్శి కూచింటి చిరంజీవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు. ఎన్నికలకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కబ్బాక శ్రావణ్ కుమార్ హాజరై కొత్త కమిటీని అభినందించారు. కమిటీ అధ్యక్షుడిగా కణితి వెంకట కృష్ణ, ఉపాధ్యక్షులుగా కూచింటి చందర్ రావు, సున్నం సీతారాం, బాడిషా రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా సున్నం నాగేంద్రబాబు (చంటి), సహాయ కార్యదర్శులుగా తాటి దనకర్, సున్నం రమేష్ ఎన్నికయ్యారు.





## జూబ్లీహిల్స్ పోరులో
# నవీన్ యాదవ్



- గులాబీ కంచుకోటను బద్దలు కొట్టిన హస్తం
- ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి ఘన విజయం
- సమీప బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతపై 24,729 ఓట్ల మెజార్టీ
- 98,988 ఓట్లు సాధించిన కాంగ్రెస్.. 74,259 ఓట్లతో రెండో స్థానంలో కారు
- డిపాజిట్ కూడా దక్కించుకోని బీజేపీ.. కేవలం 17,061 ఓట్లకు పరిమితం

అక్షరదర్బార్, హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయఢంకా మోగించారు. తన సమీప బీఆర్ ఎస్ అభ్యర్థి మాగంటి సునీతపై 24,729 ఓట్లకుపైగా మెజార్టీ సాధించి రికార్డు సృష్టించారు. నియోజకవర్గ చరిత్రలోనే ఇది అత్యధిక మెజార్టీ కావడం గమనార్హం. హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో శుక్రవారం ఉదయం కౌంటింగ్ మొదలైన మొదటి రౌండ్ నుంచే కాంగ్రెస్ అభ్యర్థి ఆధిక్యం కనిపించింది. రౌండ్ రౌండ్‌కు అంతకంతకు ఆధిక్యం పెరుగుతూ వచ్చింది. ఏ ఒక్క రౌండ్‌లోనూ బీఆర్ ఎస్ అభ్యర్థి మాగంటి సునీత ఆధిక్యం దక్కించుకోలేకపోవడం గమనార్హం. బీఆర్ ఎస్, బీజేపీ అభ్యర్థులకు 2023 ఎన్నికల కంటే తక్కువ ఓట్లు వచ్చాయి. బీజేపీకి అయితే ఏకంగా డిపాజిట్టే గల్లంతైంది. కాగా, కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ 98,988 ఓట్లు, బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత 74,259, బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి 17,061 ఓట్లు సాధించారు.

### - రౌండ్ల వారీగా కాంగ్రెస్ అభ్యర్థి ఆధిక్యం

కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ మొదటి రౌండ్ నుంచే స్పష్టమైన ఆధిక్యాన్ని కనబరిచారు. ప్రతి రౌండ్‌లోనూ అది కొనసాగించారు. అంతేకాదు.. ప్రతి రౌండ్‌లో అంతకంతకూ ఆధిక్యాన్ని పెంచుకుంటూ పోయారు. మొదటి రౌండ్ నుంచే కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ కేవలం 62 ఓట్ల ఆధిక్యంలో ఉన్నారు. నాలుగో రౌండ్ ముగిసే నాటికి 9,559 ఓట్ల ఆధిక్యానికి చేరుకున్నారు. ఐదో రౌండ్ ముగిసేసరికి, ఆ ఆధిక్యం 12,859 ఓట్లకు పెరిగింది. ఆరో రౌండ్‌లో 15,797 ఓట్ల ఆధిక్యంతో కొనసాగారు. ఏడో రౌండ్ ముగిసేసరికి ఆధిక్యం 19,797 ఓట్లకు పెరిగింది. ఎనిమిదో రౌండ్ పూర్తయ్యే సమయానికి 21,672 ఓట్ల ఆధిక్యం నమోదైంది. అలాగే తొమ్మిదవ రౌండ్‌లో ఆధిక్యం 23,921 ఓట్లకు చేరుకుంది. చివరి పదో రౌండ్ ముగిసేసరికి మొత్తం 24,729 ఓట్ల మెజార్టీ సాధించి నవీన్ యాదవ్ విజయం సాధించారు.

### - ఎన్నో ఓటములు ఈసారి గెలుపు

వల్లాల నవీన్‌యాదవ్ 17 నవంబర్ 1983న జన్మించారు. హైదరాబాద్‌లోని స్వస్థలం యూసఫ్ గూడ. ఆయన బీఆర్క్ (ఆర్కిటెక్చర్) చదువుకున్నారు. సతీమణి వర్షయాదవ్. వారికి కుమారుడు అన్ష్ యాదవ్. నవీన్ యాదవ్ 2009లో యూసుఫ్‌గూడ డివిజన్ ఎంఐఎం పార్టీ నుంచి కార్పొరేటర్‌గా పోటీ చేసి టీడీపీ అభ్యర్థి మురళీగౌడ్ చేతిలో ఓటమిపాలయ్యారు. 2014లో ఎంఐఎం తరఫున జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి 41,656 ఓట్లతో ( 25.19%) ఓటమి చవిచూశారు. అయినప్పటికీ రెండో స్థానంలో నిలిచారు. 2015లో ఎంఐఎం అభ్యర్థిగా రెహమత్‌నగర్ డివిజన్ నుంచి కార్పొరేటర్ పోటీచేసి ఓడిపోయారు. 2018లో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. అయినప్పటికీ 18,817 ఓట్లు సాధించారు. 2023 నవంబర్ 15న నాటి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో నవీన్‌యాదవ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే గోపినాథ్ ఆకస్మిక మృతి తర్వాత కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు.




# ఇది చిన్న ఎదురుదెబ్బే!

- ఉప ఎన్నిక ఓటమిపై ఆత్మపరిశీలన చేసుకుంటాం
- ఇకపై ప్రతిపక్ష పాత్ర బలంగా పోషిస్తాం
- కాంగ్రెస్ కు ప్రత్యామ్నాయం గులాబీ పార్టీనే
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

అక్షరదర్బార్, హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి తమ పార్టీకి చిన్నదెబ్బేనని పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అని చెప్పుకొచ్చారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని పేర్కొంటూ, పార్టీ కార్యకర్తలు నిరాశ చెందకుండా ముందుకు సాగాలని, మరింత బలంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఉప ఎన్నిక ఫలితాల తర్వాత శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ పార్టీ అధినేత కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అయ్యే వరకు శ్రమిస్తామని స్పష్టం చేశారు. ఉప ఎన్నిక ఫలితం పార్టీకి కొత్త ఉత్సాహాన్ని ఇచ్చిందని, రాష్ట్రంలో రాజకీయ ప్రత్యామ్నాయం కేవలం బీఆర్ఎస్ మాత్రమేనని ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. తమ అభ్యర్థి మాగంటి సునీతతో పాటు, పార్టీ నాయకులు, కార్యకర్తలు నిజాయితీగా కొట్లాడారని, విజయం కోసం నిర్విరామంగా పనిచేశారని ధన్యవాదాలు తెలిపారు. గత రెండేళ్లుగా బీఆర్ఎస్ ప్రధాన ప్రతిపక్షంగా ప్రజా సమస్యలపై పోరాడుతోందని, ఈ ఎన్నికల్లోనూ ఆరు గ్యారెంటీలు, అభివృద్ధి అంశాలపై హుందాగా పోరాటం చేశామని అన్నారు. పదేళ్లు ప్రభుత్వాన్ని నడిపిన పార్టీగా, జూబ్లీహిల్స్‌లో రూ.5వేల కోట్ల అభివృద్ధి పనులు చేశామని గుర్తు చేశారు. అయితే, ఈ ఫలితాలను సమీక్షించుకుని, ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన అవసరం ఉందని కేటీఆర్ అంగీకరించారు.

## సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ లో
# ఏసీబీ ఆకస్మిక తనిఖీలు

### - అనేక అవకతవకలు జరుగుతున్నట్లు గుర్తింపు

అక్షరదర్బార్, భూపాలపల్లి: భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో శుక్రవారం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యాలయంలో అనేక అవకతవకలు జరుగుతున్నట్లు గుర్తించారు. ఏసీబీ వరంగల్ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో మధ్యాహ్నం మూడున్నర గంటల నుంచి ఆకస్మిక తనిఖీలు జరిగాయి. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ సాంబయ్య మీడియాతో మాట్లాడుతూ ఈ ఆకస్మిక తనిఖీల్లో కార్యాలయంలో అవకతవకలు జరుగుతున్నట్లు గుర్తించామని చెప్పారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకునే వ్యక్తులు ముందుగా స్లాట్ బుక్ చేసుకుని తమ డాక్యుమెంటును అప్లోడ్ చేసిన తర్వాత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి హాజరు కావాల్సి ఉంటుందని, అయితే ఇక్కడ సబ్ రిజిస్ట్రార్ ప్రైవేట్ ఏజెంట్లను, డాక్యుమెంట్ రైటర్లను,



మధ్యవర్తులను కార్యాలయంలోకి అనుమతించినట్లు గుర్తించడం జరిగిందని ఆయన తెలిపారు. అలాగే రిజిస్ట్రేషన్ జరిగిన తర్వాత డాక్యుమెంటును రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి అందజేయాల్సి ఉంటుందని, అయితే ఇక్కడ అలా కాకుండా డాక్యుమెంట్లను ప్రైవేటు ఏజెంట్లు, డాక్యుమెంట్ రైటర్లు, మధ్యవర్తులకు ఇచ్చి రిజిస్టర్ లో వారి సంతకాలను తీసుకున్నట్లు కూడా గుర్తించామని, ఇది చట్ట విరుద్ధమని ఏసీబీ డీఎస్పీ వెల్లడించారు. ఈ అవకతవకలపై ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని, రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారని సాంబయ్య చెప్పారు. ఈ తనిఖీల్లో డీఎస్పీ సాంబయ్యతో పాటు ఇన్ స్పెక్టర్లు ఎల్ రాజు, ఎస్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు. భూపాలపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు జరపటం రిజిస్ట్రేషన్ శాఖలో కలకలం సృష్టించింది.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : aksharadarbarnews@gmail.com, Office No:7680992278 *RNI NO.TELTEL/2022/81915